అంతా మాయే..!



ప్రశ్నార్థకంగా చిట్టివలస రైతుబజారులో విక్రయాలు

విక్రయాలు ప్రారంభం కాని చిట్టివలస రైతుబజారు

- నేటికీ ప్రారంభం కాని వైనం
- తెరవెనుక ఏదో జరుగుతోందని పట్టణవాసుల ఆందోళన

తగరపువలస: చిట్టివలస రైతు బజారులో విక్రయాల ప్రారంభం వ్యవహారం అంతు చిక్కని భేతాళ ప్రశ్నగా మిగిలింది. అంతా సిద్ధంగానే ఉన్నా, ఎవరి మేలు కోసం ఈ జాప్యమనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.78 లక్షలతో నిర్మాణం

మూడు దశాబ్దాలుగా ఎదురు చూసిన రైతు బజారు సత్యనారాయణ కొండవాలు ప్రాంతంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.78 లక్షలతో నిర్మించినా ఏడాదిగా ఇక్కడ విక్రయాలు ప్రారంభం కాలేదు. కూరగాయలు, ఆకుకూరలు, ప్రొవిజనల్ వస్తువుల విక్రయానికి గాను మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 40 దుకాణాలు సిద్ధం చేసింది. అలాగే



రైతులకు కేటాయించిన దుకాణాలు

టాయిలెట్లు నిర్మించి గేట్లు ఏర్పాటు చేసింది. విద్యుత్ సౌకర్యం కూడా కల్పించింది. విక్రయాలకు సిద్ధంగా ఉన్న ఈ రైతు బజారును వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. తరువాత ఎన్నికల కోడ్ కారణంగా మార్కెటింగ్ శాఖ అధికారులు విక్రయాలు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రైతుబజారులో విక్రయాలు ప్రారంభిస్తామని ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. అంతే మార్కెటింగ్ శాఖ మాత్రం ఆయన రాకుండానే గత అక్టోబర్ 5న గంటా ప్రారంభించినట్టు మరో శిలాఫలకం వేసింది.



ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి ప్రారంభించినప్పుడు ఏర్పాటు చేసిన శిలాఫలకం



గత అక్టోబర్ 5న ఎమ్మెల్యే గంటా ప్రారంభించకుండానే మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన శిలాఫలకం



తగరపువలస ప్రధాన రహదారిపై వ్యాపారాలు

రైతుబజారు కోసం చూస్తున్నాం



బయటి మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. రైతుబజారు అందుబాటులోకి వస్తే తక్కువ ధరలకే తాజా ఆకుకూరలు, కూరగాయలు లభిస్తాయని ఎదురుచూస్తున్నాం. ప్రైవేట్ మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉండటం లేదు. రైతుబజారులో విక్రయాలు త్వరగా ప్రారంభించాలి.

– సరగడ శివాంజనేయరెడ్డి, చిల్లపేట

ఎంతో ఆదా అవుతుంది



రైతుబజారుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు, పంట పండించిన రైతులు కూరలు విక్రయిస్తారు. మారు బేరగాళ్ల బెడద ఉండదు. అందువల్ల డబ్బులు ఆదా అవుతాయి. అందుకే రైతుబజారు ఎప్పుడు ప్రారంభం అవుతుందా అని అంతా ఎదురు చూస్తున్నారు.

– రవ్వ ఈశ్వరరావు, తాటితూరు

ప్రైవేట్ మార్కెట్ కోసమేనా ఈ డ్రామా?

చిట్టివలస రైతుబజారుకు తగరపువలసలోని ప్రైవేట్ మార్కెట్ గ్రహణంగా నిలిచిందని ఇక్కడి వినియోగదారులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. రైతు బజారులో లావాదేవీలు ప్రారంభం అయితే ప్రైవేట్ మార్కెట్ మూతపడటం ఖాయమని అంటున్నారు. అందుకోసమే ప్రస్తుత ప్రైవేట్‌మార్కెట్‌కు చెందిన వాటాదారులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో కొనసాగుతూ కప్పగంతులు వేస్తారని జోరుగా ప్రచారం సాగుతుంది. వారికోసమే రైతు బజారు ప్రారంభమైనట్టు శిలాఫలకాలు ప్రత్యక్షమవుతున్నాయని నవ్వుకుంటున్నారు. ప్రొవిజనల్ స్టోర్స్ దుకాణాల లాటరీ పేరుతో మార్కెటింగ్ శాఖ రైతు బజారులో విక్రయాల ప్రారంభానికి ముందుకు రావడం లేదని తెలిసింది. దీనిపై అధికారులు ఎవరూ స్పందించడం లేదు. అలాంటప్పుడు ఇదే ఏడాది రెండు సార్లు ఇద్దరు వేర్వేరు ఎమ్మెల్యేలు శిలాఫలకాలు వేయడంలో మార్కెటింగ్ శాఖ పాత్ర ఏమిటని అంటున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు రెండు సార్లు శిలాఫలకాలు వేసినా, ప్రారంభానికి నోచుకోకపోవడంలో మతలబు ఏమిటో మార్కెటింగ్ శాఖ బయటపెట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. గతంలో తగరపువలస ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కూడా ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు రెండుసార్లు శిలాఫలకాలు వేసినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

20 రోజుల్లో ప్రారంభిస్తాం

చిట్టివలస రైతుబజారును 20 రోజుల్లో ప్రారంభిస్తాం. గతంలో వర్క్ పెండింగ్, బడ్జెట్ చాలకపోవడం జరిగింది. ఇటీవల బడ్జెట్ కూడా వచ్చింది. బయట దుకాణాలకు బహిరంగ వేలం కూడా నిర్వహించడం పూర్తయింది.

– లక్ష్మీ చైతన్య, కార్యదర్శి, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ

జనవరి 1 నుంచి పాలిథిన్ నిషేధం



ప్రైవేట్ మార్కెట్‌లో వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న శానిటేషన్ సిబ్బంది

తగరపువలస: వచ్చే ఏడాది జనవరి 1 నుంచి పాలిథిన్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని జీవీఎంసీ భీమిలి జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మినాయుడు తెలిపారు. ఉల్లంఘించిన వారికి భారీగా జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. పాలిథిన్ నిషేధం గురించి శుక్రవారం స్థానిక ప్రైవేట్ మార్కెట్, మెయిన్‌రోడ్డులో కిరాణా, కూరగాయలు, పువ్వుల వ్యాపారులతో పాటు చేపల మార్కెట్, టిఫిన్ సెంటర్ల వద్ద అవగాహన కల్పించారు. పాలిథిన్ సంచులను వినియోగిస్తున్న వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారులు, వ్యాపారులు తమతో సహకరించాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో శానిటేషన్ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు అఖిల్, సూరిబాబు, సురేష్, దాసు, మనోజ్, కిరణ్, నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం నేడు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శనివారం మధ్యాహ్నం ఆనందపురం మండలం కింగ్స్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించనున్నట్లు ఆనందపురం ఎంపీపీ మజ్జి ప్రియాంక శారద ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశంలో ప్రముఖ నాయకులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

150 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు



తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం స్థానిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు అమిత్ ప్రధాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు హెల్త్‌కార్డులు అందించి, అందులో సమాచారం పొందుపరిచారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎప్పుడైనా అనారోగ్య పరిస్థితులు కనిపిస్తే ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు టి.ఎస్.వి. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళన



నేరేళ్లవలస జ్యూట్ మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

పద్మనాభం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని నేరేళ్లవలస గణేష్ జ్యూట్ మిల్లు కార్మికులు శుక్రవారం జ్యూట్ మిల్లు గేట్ వద్ద ఆందోళన చేశారు. రెండు నెలల నుంచి మూసి వేసిన జ్యూట్ మిల్లు తెరవాలని, అక్టోబర్ నెలలో పని చేసిన కాలానికి జీతం చెల్లించాలని, బకాయి పడిన డీఏ మొత్తాన్ని చెల్లించాలని కోరారు. అకారణంగా మిల్లును మూసివేసిన కాలాన్ని పని దినాలగా లెక్కించాలని, పీఎఫ్ బకాయిలను తమ ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సురేష్, కె.అప్పలనాయుడు, జగన్మోహన్, అప్పలరాజు, సూర్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆగని తాబేళ్ల మృత్యుఘోష



మంగమారిపేట తీరానికి కొట్టుకుని వచ్చిన తాబేలు కళేబరం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట తీరంలో శుక్రవారం సాయంత్రం రెండు తాబేళ్ల కళేబరాలు కొట్టుకు వచ్చాయి. గురువారం సాయంత్రం నాలుగు తాబేళ్ల కళేబరాలు తీరానికి కొట్టుకుని వచ్చిన సంఘటన తెలిసిందే. ఇలా వరుసగా తాబేళ్ల కళేబరాలు తీరానికి కొట్టుకుని రావడం మత్స్యకారులను ఆందోళనకు గురి చేస్తోంది.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం



ప్రత్యేక అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామి

పీఎం పాలెం: చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ ప్రాంగణంలోని పంచముఖాంజనేయస్వామి సన్నిధిలో హనుమత్ వ్రతాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమంలో ముందుగా స్వామికి సుగంధ జలాలతో, సిందూరంతో అభిషేకం చేశారు. అనంతరం యాపిల్, దానిమ్మ, నారింజ, జామ, రేగు, సీతాఫలం తదితర ఫలాలు, వడమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. సిందూర, పుష్పార్చనలు చేశారు. భక్తులు హనుమాన్ చాలీసా గానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కమిటీ ప్రతినిధులు పీవీజీ అప్పారావు, ఎస్ఎస్ మూర్తి, నాగోతి తాతారావు, పిళ్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన ఇంద్రకీలాద్రికి..

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి పదిమంది భవానీలు పయనం



కనకదుర్గ ఆలయానికి కాలి నడకన బయల్దేరిన భవానీలు

పద్మనాభం: ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనక దుర్గమ్మ దర్శనానికి కాలినడకన బయల్దేరారు పదిమంది భవానీలు. మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురానికి చెందిన వీరు దీక్ష పూర్తి చేసుకుని, శుక్రవారం ఇరుముడులతో విజయవాడ దుర్గమ్మ సన్నిధికి బయల్దేరారు. గ్రామంలో దుర్గాదేవి ఆలయం నిర్మాణం జరిగితే కాలినడకన విజయవాడ కనకదుర్గ ఆలయానికి వెళతామని వీరు మొక్కుకున్నారు. గ్రామంలో దుర్గాదేవి ఆలయం నిర్మించడంతో మొక్కు చెల్లించేందుకు కాలినడకన విజయవాడ బయల్దేరి వెళ్లారు. 11 రోజులకు విజయవాడ కనకదుర్గ ఆలయ సన్నిధికి చేరుకోనున్నట్టు భవానీలు తెలిపారు.

శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర హస్త కళలు, సాంస్కృతిక సంఘం చైర్‌పర్సన్ మంజులా రెడ్డి

పీఎం పాలెం: శిల్పారామంలో చేనేత వస్త్ర మేళాను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, స్టాల్స్‌ను రాష్ట్ర హస్త కళలు, సాంస్కృతిక సంఘం చైర్‌పర్సన్ సీహెచ్ మంజుల రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. భారత ప్రభుత్వం అభివృద్ధి కమిషనర్ చేనేత, న్యూఢిల్లీ వారి సౌజన్యంతో ఈ చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నారు. మంగళగిరి, పోచంపల్లి, వెంకటగిరి, ధర్మవరం, గద్వాల్ తదితర ప్రాంతాల్లో తయారైన చేనేత వస్త్రాలు మార్కెట్ ధరల కంటే తక్కువకే స్టాల్స్‌లో లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ స్టాల్స్ ఈ నెల 26వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శిల్పారామాల ముఖ్య కార్య నిర్వాహక అధికారి వి.స్వామినాయుడు, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



కాపులుప్పాడ రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జేసీ మయూర్ అశోక్



రుషికొండ రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు పాల్‌కిరణ్

జేసీ మయూర్ అశోక్

కొమ్మాది: రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని జేసీ మయూర్ అశోక్ అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ సచివాలయం సమీపంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. సదస్సులో స్వీకరించిన వినతులు, ఫిర్యాదులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు పైలా రామారావుకు సూచించారు. సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక సదస్సు నిర్వహించే ముందు అది ఎందుకు నిర్వహిస్తున్నామో ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సంగీత్ మాథూర్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రుషికొండలో...

జీవీఎంసీ 8వ వార్డు రుషికొండలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో విశాఖ రూరల్ తహశీల్దార్ పాల్ కిరణ్ స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. స్వర్ణభారతి నగర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థల ఆక్రమణలపై ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, అక్కరమాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

తగరపువలస: ఆనందపురంలోని లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్టాక్, రిజిస్టర్లు అన్నీ సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. నగరానికి చెందిన విజిలెన్స్ సిబ్బందితో పాటు ఆనందపురం ఏవో చావా సంధ్యారత్నప్రభ,సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడలో శుక్రవారం సాయంత్రం పీఎం సూర్యఘర్ యోజన పథకంపై పంచాయతీ వాసులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ జి. శ్యాంబాబు సోలార్ విద్యుత్ వలన వచ్చే ఉపయోగాలు, సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు, డీపీవో శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతిరాజు, ఏడీఏ ఆర్.రమేష్, వెంపాడ సూరిబాబు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, బ్యాంకర్లు, సోలార్ ప్యానల్ విక్రయ దారులు పాల్గొన్నారు.

పదో తరగతిలో సత్ఫలితాలకు వంద రోజుల ప్రణాళిక



ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

తగరపువలస: పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలు చేసి అభ్యసనా సామర్థ్యాలను మెరుగు పరచాలని డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మెరుగైన ఫలితాలు సాధించడానికి సూచనలు చేశారు. టాయిలెట్లు, పాఠశాల రిజిస్టర్లు పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఆనందపురం ఎంఈవో–2 కె.గంగరాజు, సీఆర్పీలు ఉన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు



శ్లాబ్‌కు పెట్టిన రంధ్రం

మధురవాడ: భవన నిర్మాణంలో నిబంధనలు పాటించకుండా 8వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో నిర్మిస్తున్న భవనంపై జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. ఈ నిర్మాణదారుడు కనీసం సెట్ బ్యాక్స్ వంటివి కూడా వదిలిపెట్టలేదు. నోటీసులు ఇచ్చినా పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగించడంతో చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అదనపు అంతస్తు కూడా వేయడంతో శ్లాబ్‌కు రంధ్రాలు కొట్టి, చర్యలు చేపట్టారు.

డ్రైనేజీలకు పందికొక్కుల బెడద



పందికొక్కులు తవ్వేస్తున్న డ్రైనేజీ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో అంతంత మాత్రంగానే ఉన్న డ్రైనేజీలను పందికొక్కులు మరీ అధ్వానంగా మార్చేస్తున్నాయి. ముఖ్యంగా చిట్టివలస గణేష్ థియేటర్ నుంచి చావుల మదుం రోడ్డులో జెడ్పీ హైస్కూల్ వైపు డ్రైనేజీలు ఆధునికీకరణకు నోచుకోలేదు. దీంతో చిన్న వర్షానికే ఈ డ్రైనేజీలు ముంపునకు గురవుతుంటాయి. అలాంటి డ్రైనేజీలు కాలం చెల్లిపోయి పూడుకుపోతున్నాయి. అది చాలదన్నట్లు పందికొక్కులు వీటిని తవ్వి మట్టిని లాగేస్తున్నాయి. దీంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి చెత్త పేరుకుపోతోంది. డ్రైనేజీలను నిత్యం శుభ్రం చేయకపోవడంతోనే వీటిని పందికొక్కులు ఆవాసంగా మార్చుకుని తవ్వుతూ శిథిలపరుస్తున్నాయని కార్మికవాడ ప్రజలు అంటున్నారు. ఇలాంటి డ్రైనేజీలను ఆధునికీకరించాలని కోరుతున్నారు.

అన్నదాతకు అండగా..

పాదయాత్రకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పార్టీ అధ్యక్షుడు లక్ష్మణరావు

పద్మనాభం: అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ శుక్రవారం విశాఖపట్నంలో నిర్వహించిన పాదయాత్రకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం రైతులకు సమయానికి సాయం అందించకపోవడాన్ని నిరసిస్తూ అన్నదాతల గళమై నినదించేందుకు భారీ సంఖ్యలో కదిలి వెళ్లారు. ముందుగా పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు పూలమాలలు వేశారు. అనంతరం విశాఖపట్నం బయల్దేరి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, నాయకులు తాలాడ పద్మనాభం, గాడు అప్పలరాజు, సుంకర నారాయణ, కరిమిరెడ్డి రవి, తోనంగి అప్పలనాయుడు, గంగిరెడ్ల పద్మనాభస్వామి, అధిక సంఖ్యలో రైతులు ఉన్నారు.

కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమ దేవి

పద్మనాభం: కుటుంబానికి వంద రోజులు పని దినా లు కల్పించాలని డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి సూచించారు. ఉపాధి హామి పథకం పనులకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆమె మాట్లాడారు. ఉపాధి కూలికి దినసరి వేతనం రూ.300 వచ్చేటట్టు పని చేయించాలన్నారు. మండలంలోని 22 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.12.86 కోట్లతో, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.1.26లక్షలతో పనులు చేపట్టారు. ఈ పనుల్లో పలు పంచాయతీల్లో గుర్తించిన లోపాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏపీడీ ఆంజనేయులు, డీపీవో నిర్మలాదేవి, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్య విభాగం ఉన్నట్టా? లేనట్టా?

- నెల రోజులుగా నరకం చూస్తున్నాం
- నమ్మివానిపేట, సంగివలస గ్రామస్తుల ఆవేదన



నమ్మివానిపేట వద్ద ఎస్ఆర్ఐ హాస్టల్ వద్ద మురుగునీటికి అడ్డంగా వేసిన డెబ్రిస్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో పారిశుధ్య విభాగం ఉందా లేదా అంటూ రెండోవార్డు నమ్మివానిపేట, సంగివలస గ్రామాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నెలరోజుల క్రితం నమ్మివానిపేట నుంచి ఆదర్శనగర్ ఎర్రచెరువు వైపు వెళ్లే డ్రైనేజీని ఎస్ఆర్ఐ హాస్టల్ వద్ద అనిల్ నీరుకొండ యాజమాన్యం డెబ్రిస్ వేసి అడ్డుకుంది. దీనివలన నమ్మివానిపేట, సంగివలస గ్రామాల ప్రజలకే కాకుండా హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు కూడా ఇబ్బందికరంగా ఉంది. నిలిచిన మురుగునీరు రోడ్డుపై నుంచి ప్రవహించడమే కాకుండా, డ్రైనేజీ నుంచి విపరీతమైన దుర్గంధం కూడా వస్తోంది. పురుగులు పట్టిన ఈ డ్రైనేజీ కారణంగా చుట్టుపక్కల చాలామంది వ్యాధుల బారిన పడుతున్నారు. వార్డుకో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయానికో శానిటరీ సెక్రటరీ వీరే కాకుండా శానిటరీ సూపర్‌వైజర్లు కలిపి పదుల సంఖ్యలో ఉన్నారు. వందలాది మంది పారిశుధ్య కార్మికులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు. జెడ్సీ, ఇతర అధికారులు కూడా నిత్యం ఈ మార్గంలోనే నమ్మివానిపేట డంపింగ్‌యార్డుకు వెళ్తుంటారు. కాళ్ల కింద మురుగు కనిపిస్తున్నా కడుక్కుని వెళ్లిపోతున్నారు తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదు. దీంతో నమ్మివానిపేట వాసులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. నెలరోజులుగా కంటి ముందు తీవ్రమైన సమస్య ఉన్నా తమకేమీ సంబంధం లేదు అన్నట్టుగా జీవీఎంసీ సిబ్బంది వ్యవహరిస్తుండటంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడవలసిన పారిశుధ్య సిబ్బంది అసలు ఉన్నారా లేరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై భీమిలి జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఆస్పత్రి యాజమాన్యంతో లాలూచీ పడి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.